క్లుప్తంగా

ఘనంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న రాజపున్నయ్య శర్మ

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి, ఆరెపల్లి, లక్ష్మీనగర్ గ్రామాల కూడలి వద్దనున్న సదానందాశ్రమంలో విఠాల రాజపున్నయ్య శర్మ నేతృత్వంలో ఆదివారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ శిష్య బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు చంద్రశేఖరశర్మ, శిష్య బృందం మల్లయ్య, చంద్రమౌళి, రఘు, నర్సింహులు, ఎల్లయ్య పాల్గొన్నారు.

పగలే వెలుగులు



లింగుపల్లిలో పగలే వెలుగుతున్న వీధి దీపాలు

మిరుదొడ్డి(దుబ్బాక): రాత్రి పూట వెలగాల్సిన వీధి దీపాలు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పట్టపగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. నిరంతరం వెలుగుతుండటంతో గ్రామ పంచాయతీలపై విద్యుత్ భారం పడుతుందని జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజాధనం వృథా అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రాత్రిపూట మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాన కోసం బతుకమ్మ ఆటలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వరుణుడు ముఖం చాటేయడంతో అంతాయిగూడలో మహిళలు ఆదివారం బతుకమ్మ ఆటలు ఆడారు. బిందెల్లో నీళ్ల పోసి, వేప కొమ్మలు ఉంచి చుట్టూ తిరుగుతూ వానదేవుడు కరుణించాలని, పంటలు బాగా పండాలని, చెరువు కుంటలు నిండాలని కోరుతూ పాటలు పాడారు. అలా ఆడితే వానలు కురుస్తాయని నమ్మకం అని గ్రామస్తులు తెలిపారు.

కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు



సీఐ శ్రీనివాస్

దుబ్బాక: ఎరువుల దుకాణాల్లో కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సీఐ పాలెపు శ్రీనివాస్ హెచ్చరించారు. సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. అధిక ధరలకు అమ్మినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సహాయ నిధి.. పేదలకు పెన్నిధి



చెక్కు అందజేస్తున్న దామోదర్

అక్కన్నపేట(హుస్నాబాద్): సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధని కాంగ్రెస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు పాంద్రాల దామోదర్ అన్నారు. గౌరవెల్లి గ్రామంలో పలువురికి మంజూరైన రూ.1.68 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చికిత్స కోసం అందిస్తున్న ఈ డబ్బును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కనకయ్య, సంపత్, శ్రీనివాస్, భిక్షపతి, బాలయ్య, వెంకటమల్లు తదితరులు పాల్గొన్నారు.

తోటి స్నేహితుల చేయూత

గజ్వేల్‌రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. కొడకండ్ల గ్రామానికి చెందిన తలారి కర్ణాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2008 బ్యాచ్ పదో తరగతి మిత్రులు బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి కర్ణాకర్ కూతురి పేరున పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసిన రూ.56 వేల బాండ్‌ను అందించారు.

ఆషాఢ ఉత్సవం.. సర్వం సిద్ధం

ముస్తాబైన భవానందాపూర్ పాండురంగాశ్రమం

- 1 నుంచి 7 వరకు ఘనంగా వేడుకలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



ముస్తాబైన పాండురంగాశ్రమం

మర్కూక్(గజ్వేల్): రెండో పాండరీపురంగా పేరు గాంచిన మర్కూక్ మండలం భవానందాపూర్‌లోని పాండురంగాశ్రమం 94వ ఆషాఢ ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయ నిర్వాహకులు ప్రతియేటా ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. రంగారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, మెదక్, సంగారెడ్డి, నల్లగొండతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. మూడు రోజులపాటు ఆశ్రమం రామనామ స్మరణతో మారుమోగుతుంది.

చాటల ద్వారా అన్నదానం

పాండురంగాశ్రమానికి వచ్చే భక్తులను నేలపై



అన్నదానంలో పాల్గొన్న భక్తులు(ఫైల్)



కొలువుదీరిన స్వామివారు

కూర్చోబెట్టి విస్తరాకులలో చాటల ద్వారా అన్నం వడ్డిస్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కొన్ని సంవత్సరాల నుంచి ఈ ఆచారం కొనసాగుతుంది. సాంబారుతో అన్నం వడ్డిస్తారు. నిర్వాహకులు వాలంటీర్లను నియమించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకుంటారు.

శోభాయాత్రతో ప్రారంభం

జులై 1వ తేదీ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చల్లూరు నుంచి జగదేవ్‌పూర్ మీదుగా పాండురంగాశ్రమం వరకు శోభాయాత్రతో ఆషాఢ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం చల్లూరు నుంచి మర్కూక్‌లోని పాండురంగ స్వామి మఠం వరకు హరేరామ నామ స్మరణతో శోభాయాత్ర సాగుతుంది. అనంతరం ఆశ్రమంలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

- 2న యతివర భావానంద భారతీస్వామికి పాదుక పూజ
- 3న సీతారామ చంద్రస్వామికి క్షీరాభిషేకం, పుష్పార్చన
- 4న భవాని రామలింగేశ్వరస్వామికి శత రుద్రాభిషేకం, సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు
- 5న 94వ ఆషాఢ త్రిరాత్రోత్సవాలు ప్రారంభం, ఉదయం గణపతి పూజ, పుణ్యహవచనం, స్వామికి క్షీరాభిషేకం
- 6న తొలి ఏకాదశి మహోత్సవం, అఖండ నామ సంకీర్తన, సాహిత్య, సాంస్కృతిక, భక్తి సంగీత కార్యక్రమాలు
- 7న ద్వాదశి అన్నపూజ, అన్నప్రసాద వితరణ, అనంతరం ఉత్సవాలు ముగింపు

ఏర్పాట్లు పూర్తి చేశాం..

ఆషాఢ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి సేవలో పాల్గొనాలని కోరారు. ఈ యేడాది కూడా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నాం.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



తిప్పారంలో ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసిన నర్సారెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కుకునూరుపల్లి, తిప్పారం, చిన్నకిష్టాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన డబుల్‌బెడ్రూంల పథకం లబ్ధిదారుల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే ఎక్కువగా ఉన్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కిష్టారెడ్డి, రవీందర్, కరుణాకర్, మహేందర్, శ్రీకాంత్‌రెడ్డి, ఉపేందర్, కిష్టారెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. మండలంలోని మల్‌చెర్వుతండాలో గుగులోతు రవీందర్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు నిబంధనలకు అనుగుణంగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా 3,500 ఇళ్లు కేటాయించారని, ఎనిమిది ట్రిప్పుల ఇసుక కూడా ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామస్తులు రమేశ్‌నాయక్, కొమ్రానాయక్, అనిల్‌నాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరూ ఆందోళన చెందొద్దు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని డీసీసీ ప్రధాన కార్యదర్శి షాబొద్దిన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో రానివారు బాధపడాల్సిన అవసరం లేదని, త్వరలోనే అందరికీ పంపిణీ చేస్తారన్నారు. ప్రతిపక్షాలు కావాలనే ఇబ్బందులు సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సీతాబాలు, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పల తొలగింపు

హుస్నాబాద్‌రూరల్: గాంధీనగర్ గ్రామంలో రోడ్లపై ఉన్న చెత్త కుప్పలను అధికారులు తొలగించారు. సాక్షిలో శనివారం ప్రచురితమైన 'వీధుల్లో చెత్త కుప్పలు.. విజృంభిస్తున్న దోమలు' అనే కథనానికి అధికారులు స్పందించారు. వీధుల్లో ఉన్న చెత్త కుప్పలను ఆదివారం తొలగించి స్వచ్ఛతకు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు.



గాంధీనగర్‌లోచెత్త కుప్పలు తొలగించడంతో శుభ్రమైన వీధి



అదరహో.. అరచేతి అందాలు

హుస్నాబాద్: ఆషాఢ మాసమంటే ఆడపడుచులకు మక్కువ ఎక్కువ. చేతులకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోతారు. పట్టణంలోని స్వర్ణకారుల సంఘం భవనంలో ఆదివారం మహిళలు గోరింటాకు పండుగ చేసుకుని సందడి చేశారు. ఫాస్ట్ కల్చర్‌లో పడిపోకుండా ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. మైదాకులో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని వారు తెలిపారు.



ఎర్రబడిన చేతులు చూపుతున్న మహిళలు

'ఇంజనీరింగ్' తెచ్చినందుకే విమర్శలా?

గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి



మాట్లాడుతున్న లింగమూర్తి

హుస్నాబాద్: ఈ ప్రాంత విద్యార్థుల కోసం ఇంజినీరింగ్ కళాశాలను తెచ్చినందుకే బీఆర్ఎస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విమర్శలు గుప్పిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మండిపడ్డారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆర్టీఓ, పాలిటెక్నిక్ కళాశాలలను తెస్తే ఎద్దేవా చేశారని, మల్లన్నసాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులను పూర్తిచేస్తే గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయలేదని నిర్లక్ష్యం చేశారని వాపోయారు. సిద్దిపేటలో మెడికల్ కళాశాల కోసం హుస్నాబాద్‌ను కుదవపెట్టారని ఆరోపించారు. నలుగురు మంత్రులు హుస్నాబాద్‌ను ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని మాట్లాడారే తప్ప ఏ ఒక్క పార్టీని ఉద్దేశించి విమర్శించ లేదని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, నాయకులు చిత్తారి రవీందర్, కోమటి సత్యనారాయణ, అక్కు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి కుటుంబానికి హరీశ్ పరామర్శ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దివంగత నేత అనంతుల మదన్‌మోహన్ కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. మదన్ మోహన్ సతీమణి ప్రమీలదేవి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల చనిపోయారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఆదివారం జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్యామ్‌మోహన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు(గజ్వేల్): ములుగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పుష్పలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెయల్ మ్యాథ్స్, జెయల్ బాటనీ, జెయల్ జువాలజీ, పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ సోషల్, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీలున్నాయని తెలిపారు. అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు 30న ఉదయం 11 గంటలకు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు.

మోడల్ స్కూల్‌లో..

బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన గణితం బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాలోతు సంగీత ఒక ప్రకటనలో పాల్గొన్నారు. ఎమ్మెస్సీ బీఈడీ అర్హతతో టెట్ అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారు 9వ తరగతి నుంచి ఇంటర్‌మీడియెట్ విద్యార్థులకు బోధించాలని తెలిపారు.



నంగునూరు(సిద్దిపేట): రాంపూర్‌లో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



బెజ్జంకి(సిద్దిపేట): బోనాలతో పోచమ్మ ఆలయానికి వస్తున్న మహిళలు

బోనం.. ఘనం

బెజ్జంకి(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట): బెజ్జంకి, గూడెం, గ్రామాల్లో ఆదివారం ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. బెజ్జంకిలో రెడ్డి, పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించి గ్రామ దేవతలకు పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ప్రతియేటా ఆశాఢ మాసంలో బోనాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు.

అమ్మవారికి బోనాలు

నంగునూరు మండలం రాంపూర్‌లో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కీలక నేతలు జైలుకు వెళ్లడం ఖాయం

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ పార్టీ కీలక నాయకులు జైలుకు వెళ్లడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉండి బీఆర్ఎస్ నాయకులు అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సినీ కళాకారుల ఫోన్‌లు ట్యాప్ చేశారని ఆరోపించారు. ఉద్యోగ పరీక్షల నిర్వహణలో పేపర్ విక్రయాలతో రూ.కోట్ల అవినీతి జరిగిందని, ప్రాజెక్టుల నిర్మాణంలోను చాలా అవినీతి, అక్రమాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిపై విచారణ జరుగుతోందని, త్వరలోనే కీలక నాయకులు జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మధు, అర్షద్, బబ్బు, శ్రీకాంత్, శేఖర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలకు ఉపాధ్యాయులు వద్దు

- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల తనిఖీల కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కాకుండా డీఈఓ, ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలను వినియోగించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కష్టతరంగా మారిందని, అవసరమైన పాఠశాలలకు అదనపు పోస్టులను మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు తప్పెట్ల యాదగిరి, చిర్ర యాదగిరి, వెంకటకిరణ్, ప్రభావతి, ఎం.కృష్ణ, రామచంద్రం, హర్షియ, వి.కృష్ణ, ప్రశాంత్ కుమార్, ప్రవీణ్‌కుమార్, శివలింగం, రవీందర్, నిర్మల, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రఘునందన్‌రావుకు పరామర్శ

మిరుదొడ్డి(దుబ్బాక): కాలి నొప్పితో బాధ పడుతూ సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావును బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, ప్రముఖ న్యాయవాది తుంగ కనకయ్య, మిరుదొడ్డి మండల అధ్యక్షుడు జిగిరి అమర్ ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోహెడరూరల్(హుస్నాబాద్): ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2002-2003 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

వివిధ ఉన్నత పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. స్కూళ్లలో ఆదివారం కలుసుకుని సందడి చేశారు.

కోహెడరూరల్(హుస్నాబాద్)/మిరుదొడ్డి(దుబ్బాక)/జగదేవ్‌పూర్(గజ్వేల్): కోహెడ రూరల్ మండలంలోని బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో 2002–2003, మిరుదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05, జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో 1986–87 బ్యాచ్‌లకు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకున్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి పాఠశాలలో 2004-05 బ్యాచ్ విద్యార్థులు